
TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

బుధవారం 25, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :188 | పేజీలు :4 | వెల. 3/-




## డీలిమిటేషన్ పై కసరత్తు




## ప్రభుత్వ విద్యలో

# సరికొత్త విప్లవం



- వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచే ప్రారంభం
- నూరు నియోజకవర్గాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు
- నర్సరీ నుండి ఇంటర్ వరకు ఒకే ప్రాంగణంలో విద్య
- కార్పొరేట్ స్థాయి వసతులు, ల్యాబ్ లు, ఉచిత బస్సు సౌకర్యం

## 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్" (TPS) పేరుతో సరికొత్త విద్యా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. వచ్చే విద్యా సంవత్సరం 2026-27 నుండి రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు అనూహ్య స్పందన లభించింది. అక్కడ ఉన్న అంతర్జాతీయ స్థాయి వసతులు చూసి ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుండి విడిపించి ఈ స్కూల్లో చేరుస్తున్నారు. ఈ విజయవంతమైన నమూనాను రాష్ట్రమంతటా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

— హైదరాబాద్, ప్రభాత గమనం



## అది లొట్టపీసు కేసే

- నేను ముందు నుంచే చెబుతున్నా..
- అందులో ఏమీ లేదని ప్రభుత్వమే చార్జిషీట్ లో ఒప్పుకుంది
- మీడియాతో చిట్ చాట్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03

## ఓటీఆర్ రేపే లాస్ట్

- గడువు పొడిగించే అవకాశం లేదన్న టీజీపీఎస్సీ?
- సర్టిఫికెట్లు అందక అభ్యర్థుల ఆందోళన
- గడువు మరోసారి పెంచాలని వేడుకోలు

03



## మంత్రి పదవి ఇస్తే..

- కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచిపేరు
- మళ్లీ అధికారంలోకి రావాలంటే తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే
- అసెంబ్లీ లాబీలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

03

బుధవారం
25.03.2026
www.prabhatagamanam.com

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# ప్రభుత్వ విద్యలో సరికొత్త విప్లవం

## 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'

- వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచే ప్రారంభం
- నూరు నియోజకవర్గాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు
- నర్సరీ నుండి ఇంటర్ వరకు ఒకే ప్రాంగణంలో విద్య
- కార్పొరేట్ స్థాయి వసతులు, ల్యాబ్ లు, ఉచిత బస్సు సౌకర్యం



**హైదరాబాద్, ప్రభాత గమనం:**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్" (TPS) పేరుతో సరికొత్త విద్యా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. వచ్చే విద్యా సంవత్సరం 2026–27 నుండి రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ఆరుట్ల స్ఫూర్తితో ముందడుగు

ఇప్పటికే రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు అనూహ్య స్పందన లభించింది. అక్కడ ఉన్న అంతర్జాతీయ స్థాయి వసతులు చూసి ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుండి విడిపించి ఈ స్కూల్లో చేరుస్తున్నారు. ఈ విజయవంతమైన నమూనాను రాష్ట్రమంతటా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

### నర్సరీ టు ఇంటర్ – ఒకే గొడుగు కింద..

ఈ పబ్లిక్ స్కూళ్ల ప్రత్యేకత ఏమిటంటే.. ఒకే ప్రాంగణంలో నర్సరీ నుండి 12వ తరగతి (ఇంటర్మీడియట్) వరకు విద్య అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం వేర్వేరు చోట్ల ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు మరియు జూనియర్ కాలేజీలను క్లబ్ చేసి, ఒకే క్యాంపస్‌లో అన్ని తరగతులు నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు ఒక స్థాయి పూర్తి చేశాక మరో స్కూల్ కోసం వెతకాల్సిన అవసరం ఉండదు.

### వచ్చే ఏడాది నుంచే అమలు

రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలు వచ్చే ఏడాది నుండి కార్యరూపం దాల్చనున్నాయి. ఒక్కో పాఠశాలలో సుమారు 1500 మంది విద్యార్థులు చదువుకునేలా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.

2026–27 విద్యా సంవత్సరంలో గజ్వేల్‌లో ప్రీ–ప్రైమరీ నుండి 8వ తరగతి వరకు తరగతులతో ఈ ప్రక్రియ మొదలవుతుంది. ఆ తర్వాతి ఏడాది అంటే 2027–28 నుండి 9వ తరగతి నుండి ఇంటర్ వరకు తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక పాఠశాల విభాగంలో ప్రతి తరగతికి ఒక ప్రత్యేక టీచర్‌ను నియమించడం ద్వారా విద్య నాణ్యతను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### అబ్బురపరిచే వసతులు – సెమీ రెసిడెన్షియల్ విధానం

**తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పూర్తిగా 'సెమీ రెసిడెన్షియల్' పద్ధతిలో పనిచేస్తాయి.**

- **ఆహారం:** విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారంతో కూడిన బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం రుచికరమైన భోజనం, సాయంత్రం స్నాక్స్ ప్రభుత్వం అందిస్తుంది.
- **రవాణా:** సుదూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వమే స్కూల్ బస్సులను ఏర్పాటు చేయనుంది.
- **ల్యాబ్‌లు & లైబ్రరీ:** సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ భాషల కోసం అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు మరియు విశాలమైన లైబ్రరీలను అందుబాటులోకి తెస్తున్నారు.
- **క్రీడలు:** చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్లే గ్రౌండ్స్ ఏర్పాటు చేస్తున్నారు.



# అసెంబ్లీలో ఎమ్మెల్యేల తీరుపై ముఖ్యమంత్రి ఆరా

**- ప్రతిరోజూ అసెంబ్లీ తర్వాత రిపోర్టు పరిశీలన**

ప్రభాత గమనం, హైదరాబాద్ : అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుల హాజరు, పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి ఏ రోజుకు ఆ రోజు ఆరా తీస్తున్నట్లు తెలుస్తున్నది. సభా ప్రారంభం సమయానికి ఎంతమంది సభ్యులు వస్తున్నారు? మొదలైన తరువాత ఎంతమంది వస్తున్నారు? సభా జరుగుతున్న టైమ్‌లో ఇన్నర్ లాబీల్లో ఎవరు కాలక్షేపం చేస్తున్నారు? బయటికి వెళ్లిపోతున్న ఎమ్మెల్యేలు ఎవరు? అని ప్రతిరోజూ సభ ముగిసిన తర్వాత విప్‌లు ఇచ్చే రిపోర్టును సీఎం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏర్పాటు చేసిన సీఎల్పీ మీటింగ్‌లో సభ్యుల హాజరు, చర్చల సమయంలో అనుసరించాల్సిన విధానాలపై సీఎం కౌన్సిలింగ్ ఇచ్చారు. మరుసటిరోజు నుంచి సభ్యులు సభా ప్రారంభాని(ఉదయం 10 గం)కి పది నిమిషాల ముందు వస్తున్నారు. కానీ క్వశ్చన్ అవర్ మొదలైన అరగంట తర్వాత మెజార్టీ సభ్యులు బయటికి వెళ్లిపోతున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. కొందరు సభ్యులు ఇన్నర్ లాబీ, మెంబర్స్ లాంజిలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారని విమర్శలు వచ్చాయి. ఈ విషయాన్ని గ్రహించిన విప్‌లు సభా సమయంలో బయట ఉన్న ఎమ్మెల్యేల వద్దకు వచ్చి సభలోకి రావాలంటూ కోరుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అయినా కొందరు ఎమ్మెల్యేలు పట్టించుకోవట్లేదని, అలాంటి సభ్యుల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిసింది.

# భార్యపై కోపంతో కూతురుకు విషమిచ్చిన తండ్రి

- ఆపై తానూ ఆత్మహత్యాయత్నం
- మూడేళ్ల చిన్నారి మృతి, తండ్రి పరిస్థితి విషమం



సంస్థాన్ నారాయణపురం, ప్రభాత గమనం: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి తన మూడేళ్ల కూతురికి విషమిచ్చి, అనంతరం తానూ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో చిన్నారి మృతి చెందగా, తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెం గ్రామానికి చెందిన వరికుప్పల రవి (30)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తడంతో భార్య 8 నెలల పాపతో పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్ద కుమార్తె మేఘన (3) తండ్రి వద్దే ఉండేది. భార్య తిరిగి కాపురానికి రాకపోవడంతో ఈ నెల 21న రవి తన కూతురు మేఘనకు ఎలుకల మందు తాగించి, అనంతరం తానూ తాగాడు. పరిస్థితి విషమించడంతో ఇద్దరినీ నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం చిన్నారి మేఘన మృతి చెందింది. ప్రస్తుతం తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

# గిగ్ వర్కర్లకు ప్రత్యేక చట్టం

- వారి వివరాలకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు
- అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి వివేక్

ప్రభాత గమనం, హైదరాబాద్: గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, జాబ్ గ్యారెంటీ, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిందని మంత్రి వివేక్ తెలిపారు. శాసనసభలో సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, బీర్ల అయిలయ్య అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. గిగ్ వర్కర్ల వివరాల నమోదుకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తున్నామని, ఆ బోర్డు ద్వారా వారి సమస్యలను పరిష్కరించనున్నామని చెప్పారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు అంశంపై ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

### ఇరిగేషన్ సమస్యలపై చర్చ



ఇక నీటిపారుదల సమస్యలపై పలువురు సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. బస్వాపూర్ రిజర్వాయర్ పనులు పూర్తిచేయాలని వేముల వీరేశం, పెద్దవాగుపై జగన్నాథ ప్రాజెక్టును పూర్తి చేయాలని పాల్వాయి హరీశ్ కోరారు. మల్లన్నసాగర్ పనులు పూర్తి చేయాలని కొత్త ప్రభాకర్ రెడ్డి, సింగూరు డ్యామ్ మరమ్మతులు, పరిహారం చెల్లింపులపై సునీతాలక్ష్మారెడ్డి, కల్వకుర్తి పథకం ద్వారా నీటి విడుదలపై కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రస్తావించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖకు సంబంధించిన సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# బాలికపై లైంగికదాడి!

**- నిందితులు ఇద్దరూ మైనర్లే**

ప్రభాత గమనం, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో దారుణం చోటుచేసుకుంది. ఐదేళ్ల బాలికపై ఇద్దరు మైనర్లు లైంగికదాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ నెల 22న పాపను ఇద్దరు 14 సంవత్సరాల బాలురు ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. చిన్నారి అస్వస్థతకు గురి కాగా తల్లిదండ్రులు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరిశీలించి బాలికపై లైంగికదాడి జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం బాలిక చికిత్స పొందుతుండగా అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరు మైనర్లు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

# ఫార్ములా-ఈ కార్ రేస్ లొట్టపీసు కేసే

- నేను ముందు నుంచే చెబుతున్నా..
- అందులో ఏమీ లేదని ప్రభుత్వమే చార్జిషీట్ లో ఒప్పుకుంది
- మీడియాతో చిట్ చాట్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**



'నేను ముందు నుంచీ చెబుతూనే ఉన్నా.. ఫార్ములా ఈ కార్ రేసు కేసు ముమ్మాటికీ లొట్ట పీసు కేసే' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌పై బీఆర్ఎస్ తెస్తున్న ప్రైవేటు బిల్లు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు తెరపైకి ఫార్ములా కేసు చార్జిషీట్ తెచ్చారని ఆరోపించారు. సీఎం సంతకం చేసిన తొలి ఫైలు దొరకడం లేదనే విషయాన్ని తాము బయటపెట్టడంతో సర్కారు పూర్తిగా ఇరకాటంలో పడిందన్నారు. ఈ కార్ రేసు కేసులో ఏమీ లేదని ప్రభుత్వమే చార్జిషీట్‌లో ఒప్పుకున్నదని.. ఇక్కడి బ్యాంకు నుంచి పంపిన రూ.45 కోట్ల నిధులు అక్కడి బ్యాంకు అకౌంట్‌లో భద్రంగా ఉన్నాయని చెప్పారు. తెలంగాణ నుంచి పంపిన నిధులు ఎక్కడా దారి మళ్ల లేదని తెలిపారు. ఇక్కడి నుంచి రూ.45 కోట్లు పంపితే రూ.600–700 కోట్లని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అసలు ఈ కేసులో ఎవరికి అనుచిత లబ్ధి చేకూరిందని ప్రభుత్వం ఆరోపిస్తున్నదో వారి పేరే చార్జిషీట్‌లో లేదన్నారు. ఈ కేసు కోర్టులో నిలబడదని వెల్లడించారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచడానికి, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ ప్రతిష్టాత్మక రేసును నగరానికి తీసుకువచ్చామన్నారు. ఈ రేసు వల్ల వారం రోజుల వ్యవధిలోనే దాదాపు రూ.700 కోట్ల ఆర్థిక ప్రయోజనం రాష్ట్రానికి కలిగిందని నీల్సన్ అనే సంస్థ స్పష్టం చేసిందని తెలిపారు.

### లొట్టపీసు కేసు అయితే భయమెందుకు: సీతక్క

లొట్టపీసు కేసు అయితే కేటీఆర్ ఎందుకు బయపడుతున్నారు? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆమె మీడియాతో చిట్ చాట్ చేశారు. తనకోసం అధికారులను వేధించవద్దని కేటీఆర్ కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని, అధికారులపై అంత ప్రేమ ఉంటె రెడ్ బుక్‌లో అధికారుల పేరు రాస్తున్నాం, అంతు చూస్తామని అనడం దేనికోసం అని సీతక్క నిలదీశారు. అధికారులను వాడు వీడు అని కేటీఆర్ మాట్లాడుతున్నారు అదేమి సంస్కారం.. ఆయనది అంతా మేకపోతు గాంభీర్యమా? తప్పు చేయకపోతే ధైర్యంగా కేసును ఎదుర్కోవాలి అని సీతక్క హితవు పలికారు.

# విద్యా రుణం ఏమైంది?

### ఆకునూరి మురళి సిఫార్సులను గౌరవించరా?: గెల్లు శ్రీనివాస్

ప్రభాత గమనం, హైదరాబాద్: విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సిఫార్సులను కూడా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహించగా, విద్యార్థి నాయకులు బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపారు. వారిని పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ, బడ్జెట్‌లో విద్యకు 18 శాతం నిధులు కేటాయించాలని కమిషన్ సూచించినప్పటికీ ప్రభుత్వం 8 శాతానికే పరిమితం చేసిందని అన్నారు. గత ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో 80 శాతం విడుదల కాలేదని, రూ.8 వేల కోట్ల బకాయి ఉండగా కేవలం రూ.4 వేల కోట్లే కేటాయించడం ద్వారా విద్యార్థులను, కళాశాల యాజమాన్యాలను మోసం చేసిందని విమర్శించారు. అలాగే విద్యానిధి పథకం అమలు చేయలేదని, రూ.5 లక్షల విద్యా రుణం హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ప్రభాత గమనం, హైదరాబాద్ :
తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే తనలాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమని పేర్కొన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం గతంలో హామీ ఇచ్చిందని, అధిష్టానం ఇప్పుడు ఏం చేస్తుందో తెలియదని రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అయితే తాను ఆ పదవి కోసం పాకులాడడం లేదన్నారు. తనకు రేవంత్‌రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని, సోమవారం సీఎంతో ప్రత్యేకంగా భేటీ అయిందేం లేదని, ఎదురుపడితే పలకరించుకున్నామని స్పష్టం చేశారు. నేడు కేటీఆర్‌తోనూ సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానని, 2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చిన తర్వాత కూడా 12మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకోవడం తప్పని కేటీఆర్‌కు చెప్పినట్లుగా రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు.



## నాకు మంత్రి పదవి ఇస్తే..

- కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచిపేరు
- మళ్లీ అధికారంలోకి రావాలంటే తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే
- అసెంబ్లీ లాబీలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

# విచారణ స్పీడప్ చేయండి

- కర్ల రాజేశ్ లాకప్ డెత్ కేసుపై డీజీపీని కలిసిన మంద కృష్ణమాదిగ



ప్రభాత గమనం, హైదరాబాద్ : సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన కర్ల రాజేష్ లాకప్ డెత్ కేసు విచారణను వేగవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీజీపీ కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కర్ల రాజేష్ లాకప్ డెత్‌కు ప్రధాన కారకుడైన అప్పటి చిలుకూరు ఎస్ఐ సురేశ్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. లాకప్ డెత్ జరిగిన సమయంలో విధుల్లో ఉన్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విధి నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కోదాడ నూతన డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్‌రెడ్డి కూడా కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. సూర్యాపేట ఎస్పీ నరసింహపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌లోని సెక్షన్ 4 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఓటీఆర్ రేపే లాస్ట్

- గడువు పొడిగించే అవకాశం లేదన్న టీజీపీఎస్సీ?

ప్రభాత గమనం, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (OTR) అప్డేట్ గడువు రేపటితో ముగియనుంది. మొదట గత నెల 25తో ముగియాల్సిన గడువును టెక్నికల్ సమస్యలు, కొత్త కుల ధ్రువీకరణ పత్రాల ఆలస్యం తదితర కారణాల వల్ల రెండు సార్లు పొడిగించి ఈ నెల 25ను తుది గడువుగా నిర్ణయించారు. ప్రస్తుతం గడువు సమీపిస్తుండటంతో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తాజాగా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు కాలేజీల నుండి సర్టిఫికెట్లు పొందడంలో ఆలస్యమవుతోందని చెబుతున్నారు. ఇకపై గడువు పొడిగించే అవకాశం లేదని టీజీపీఎస్సీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కావున అభ్యర్థులు వెంటనే టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి OTR ప్రక్రియను పూర్తి చేయాలని కమిషన్ సూచించింది.

# రాజకీయ ఉనికి కోసమే విపక్షాల విమర్శలు

- కేసీఆర్ ప్రభుత్వంలో దోపిడీ, దౌర్జన్యాలకే చోటు: కాంగ్రెస్ఎమ్మెల్సీలు



ప్రభాత గమనం, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకపోయేలా రూపొందించిందని, కానీ విపక్ష సభ్యులు రాజకీయ ఉనికి కోసం విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం శాసనమండలిలో బడ్జెట్ సభ్యులు బలమూరి వెంకట్, బొగ్గరపు దయానంద్, శంకర్నాయక్మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత బీఆర్ఎస్పాలనలో శంకుస్థాపనలు చేయడం తప్పా.. ప్రాజెక్టులు పనులు చేపట్టలేదని, గుత్తేదార్ల నుంచి కమీషన్లు భారీగా తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ప్రభుత్వం పేదల కోసం పాటు పడుతుంటే ఓర్వలేక విమర్శలు చేస్తూ ప్రజలు కోసం కొట్లాడుతున్నామని ఫోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందని, ఆయన కుటుంబ సభ్యులతో పాటు, ఎమ్మెల్యేలు భూకబ్జాలు, ప్రాజెక్టులో కమిషన్లు తీసుకొని కోట్లకు పడగలెత్తారని మండిపడ్డారు.


# విచారణ తర్వాతే జీతాలు కట్ చేస్తాం..

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రభాత గమనం, హైదరాబాద్: తల్లిదండ్రులను పట్టించుకోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల జీతాలలో 10 శాతం కట్ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన తర్వాతే జీతం కట్ చేస్తామని, బలవంతంగా కట్ చేసేది ఉండదని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, పిల్లలు ఒప్పుకుంటేనే ఇది జరుగుతుందని, కలెక్టర్ విచారణ అధికారిగా ఉంటారని తెలిపారు. జీవన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో కొనసాగేలా సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఆయన పార్టీలోనే ఉంటారని ఆశిస్తున్నామని లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

బుధవారం
25.03.2026
www.prabhatagamanam.com
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక




# డీలిమిటేషన్ పై కసరత్తు

- తెలంగాణలో భారీగా పెరగనున్న నియోజకవర్గాలు
- 26 లోక్ సభ, 179 అసెంబ్లీ స్థానాలు పెరిగే చాన్స్
- దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఫోకస్

ప్రభాత గమనం, హైదరాబాద్ : దేశంలో నియోజక వర్గాల పునర్విభజనతో అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్య భారీగా పెరగనుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోనూ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో గణనీయమైన పెరుగుదల ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇక లోక్‌సభ స్థానాల సంఖ్య 26కు.. అసెంబ్లీ సీట్ల సంఖ్య 179కు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ల బిల్లు అమల్లోకి రానుంది.

## తెలంగాణలో ప్రస్తుతం 119 స్థానాలు

తెలంగాణ విషయానికి వస్తే.. ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు.. 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇక కేంద్రం నియోజకవర్గాల పునర్విభజన చేస్తే.. అసెంబ్లీ నియోజకవర్గాలు మరో 60 పెరిగి ఏకంగా 179 సీట్లు అవుతాయనే అంచనాలు వెలువడుతున్నాయి. అదే సమయంలో లోక్‌సభ స్థానాల విషయానికి వస్తే.. ప్రస్తుతం 17 ఎంపీ సీట్లు ఉండగా.. అవి మరో 6 పెరిగి.. 26కు చేరుకుంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.అయితే జనాభా లెక్కలతో సంబంధం లేకుండా ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను 50 శాతం పెంచాలని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పుడు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కలిపి 543 లోక్‌సభ స్థానాలు ఉండగా.. అవి 816 స్థానాలకు పెరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు 4123 కాగా.. డీలిమిటేషన్ తర్వాత ఈ సంఖ్య 6185కి చేరుతుందని తెలుస్తోంది. కొత్తగా మరో 2062 ఎమ్మెల్యే స్థానాలు పెరగనున్నాయి. ఈ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. 2023లో పార్లమెంటు ఆమోదం తెలిపిన మహిళా రిజర్వేషన్ చట్టంలో భాగంగా లోక్‌సభ స్థానాలు పెరిగిన తర్వాత అందులో 273 స్థానాలను మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. మహిళా రిజర్వేషన్ల చట్టం ప్రకారం మొత్తం 6185 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళలకు 2042 స్థానాలు కేటాయించాల్సి ఉంటుంది. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 175 ఉండగా.. మరో 88 సీట్లు పెరిగి మొత్తంగా 263 నియోజకవర్గాలు అందుబాటులోకి రానున్నాయి. ఇక 25 లోక్‌సభ నియోజకవర్గాలు ఇప్పుడు ఉండగా.. డీలిమిటేషన్ తర్వాత మరో 12 లేదా 13 స్థానాలు పెరిగి ఆ సంఖ్య 25 నుంచి ఏకంగా 37 లేదా 38కి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# మతం మారితే 'ఎస్సీ' హోదా రద్దు

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- క్రైస్తవంలోకి మారిన వ్యక్తి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద రక్షణ పొందలేరు
- హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లో ఉంటేనే వర్తించే రిజర్వేషన్ హక్కులు
- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: మత మార్పిడి చేసుకున్న వ్యక్తులకు సంబంధించి షెడ్యూల్డ్ కులాల (SC) హోదా మరియు హక్కులపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. ఒక వ్యక్తి హిందూ, బౌద్ధ లేదా సిక్కు మతాలను వదిలి ఇతర మతాల్లోకి మారిన వెంటనే సదరు వ్యక్తి తన ఎస్సీ హోదాను, తద్వారా లభించే చట్టపరమైన హక్కులను కోల్పోతారని న్యాయస్థానం స్పష్టం చేసింది.

## కేసు నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా సేవలందిస్తున్నారు. అయితే, తనపై జరిగిన ఒక దాడికి సంబంధించి ఆయన ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై గతంలో విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, క్రైస్తవ మతంలో కుల వ్యవస్థ లేదని, మతం మారిన వ్యక్తికి ఎస్సీ హోదా వర్తించదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## సుప్రీంకోర్టు స్పష్టీకరణ

పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, ఏపీ హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది:

- **హోదా రద్దు:** మతం మార్చుకున్న వ్యక్తికి గతంలో ఉన్న సామాజిక హోదా (SC) ఇకపై కొనసాగదు. మతం మారిన క్షణం నుండే ఎస్సీ హక్కులు రద్దవుతాయి.
- **చట్టపరమైన రక్షణ:** క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా ఉన్న వ్యక్తి, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద ప్రత్యేక రక్షణను క్లెయిమ్ చేయలేరు.
- **మతపరమైన నిబంధనలు:** రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. ఎస్సీ హోదా కేవలం హిందూ, సిక్కు మరియు బౌద్ధ మతస్థులకు మాత్రమే పరిమితం చేయబడింది. ఇతర మతాల్లో కుల వివక్ష ఉండదనే ప్రాతిపదికన ఈ నిర్ణయం అమల్లో ఉంది.

# కల్తీ కారం పట్టివేత

- ఎనుమాముల మార్కెట్ సమీపంలో పోలీసుల మెరుపు దాడులు
- మిర్చి తొడిమలతో కారం తయారీ.. 70 కిలోల స్టాక్ స్వాధీనం
- నిర్వాహకులపై కేసు నమోదు



అక్షరదర్బార్, వరంగల్: ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ రాయుళ్లపై వరంగల్ పోలీసులు, ఆహార భద్రతా అధికారులు కొరడా ఝుళిపించారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఒక ఇండస్ట్రీస్‌లో నిబంధనలకు విరుద్ధంగా కల్తీ కారం తయారు చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు.

## - తొడిమలే ముడిసరుకుగా..

సాధారణంగా పారేసే మిర్చి తొడిమలను ఉపయోగించి, వాటికి రంగులు అద్ది కల్తీ కారం తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఈ కేంద్రం నుంచి సుమారు 70 కిలోల కల్తీ కారం నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రతా అధికారులు కృష్ణమూర్తి, మౌనికలతో కలిసి సీఐ సురేశ్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

## - కఠిన చర్యలు తప్పవు

అనంతరం అధికారులు మాట్లాడుతూ.. తక్కువ ధరకే వస్తుందని ప్రజలు ఇలాంటి కల్తీ కారాన్ని కొని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి కల్తీకి పాల్పడుతున్న సదరు ఇండస్ట్రీ నిర్వాహకులపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఈజీఎస్ పనులపై కలెక్టర్ సమీక్ష

ప్రభాత గమనం, హనుమకొండ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన వివిధ పనులు, వాటి పురోగతిపై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఉపాధి హామీ పనులు, బిల్లుల చెల్లింపు, తదితర అంశాలను గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు. ఉపాధి హామీ పనుల వ్యయం సంబంధించి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డివో మేన శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ సైదుల్ రెడ్డి, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra